డబుల్ రోడ్డు.. ఇంకెప్పుడు?

- కథలాపూర్ – భూషణరావుపేట రోడ్డుకు గ్రహణం
- 6 నెలల క్రితం నిధులు మంజూరు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు


కథలాపూర్- భూషణరావుపేట రూట్‌లో సింగిల్ రోడ్డు

కథలాపూర్: అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధుల చుట్టూ నాయకులు తిరగడం సహజం. కానీ అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనా నెలల తరబడి పనులు ప్రారంభించని పరిస్థితి కథలాపూర్ మండలంలో నెలకొంది. దీనికి నిదర్శనం కథలాపూర్ మండల కేంద్రం నుంచి భూషణరావుపేట వరకు డబుల్ రోడ్డు పనులే. నిర్లక్ష్యం ఎవరిదో కానీ నిధులు మంజూరైనా పనులు చేయకపోవడం సరికాదని ప్రజలు మండిపడుతున్నారు.

డబుల్ రోడ్డు పనులకు రూ. 6 కోట్లు మంజూరు...

కథలాపూర్ మండలకేంద్రం నుంచి భూషణరావుపేట గ్రామం మీదుగా ఐదు గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుంది. సింగిల్ రోడ్డుతో వాహనదారులు ఇబ్బందిపడుతుండగా.. సాయంత్రం వేళ వాహనాల రద్దీ పెరిగి ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయి. ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చితేనే సమస్య తీరుతుందని నాయకులు భావించి ప్రజాప్రతినిధులకు విన్నవించారు. సుమారు 4.5 కిలోమీటర్ల దూరం డబుల్ రోడ్డు పనుల కోసం 6 నెలల క్రితం రూ. 6 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులు మంజూరు కావడంతో అప్పట్లో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్ల పనులపై నిర్లక్ష్యం వద్దు



ప్రస్తుతం పరిస్థితుల్లో ఇంటికో బైక్ ఉండటం సహజం. కార్లు, ఆటోల వినియోగం మరింత పెరిగింది. వాహనాల వినియోగం ఎక్కువగా ఉన్న రోడ్లను డబుల్ రోడ్లుగా మార్చితే ప్రమాదాలను నివారించవచ్చు. కథలాపూర్–భూషణరావుపేట డబుల్ రోడ్డు కోసం నిధులు మంజూరు చేసినప్పటికి పనులు ప్రారంభించకపోవడం బాధాకరం. ఈ పనులపై నిర్లక్ష్యం ఎవరిదో అధికారులకు తెలియాలి. నిధులు మంజూరు చేయడమే కాదు.. ఆ పనులు పూర్తి చేయించే వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తే బాగుంటుంది.

– బద్దం మహిపాల్‌రెడ్డి, భూషణరావుపేట

నెలల తరబడి జాప్యం సరికాదు



కథలాపూర్ నుంచి భూషణరావుపేట రూట్‌లో ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ రోడ్డును ఎప్పుడో డబుల్ రోడ్డుగా మార్చాల్సింది. ఇప్పుడైనా డబుల్ రోడ్డు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం మంచిదే. కానీ పనులను నెలల తరబడి ప్రారంభించకపోవడం దారుణం. గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే రోడ్లు సౌకర్యం ఉండాలి. డబుల్ రోడ్డును భూషణరావుపేట నుంచి చింతకుంట, దుంపేట గ్రామం వరకు చేపట్టేందుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.

– కోరుట్ల రాజేశ్, చింతకుంట

టెండర్ ప్రక్రియ పూర్తయింది

కథలాపూర్ నుంచి భూషణరావుపేట గ్రామం వరకు డబుల్ రోడ్డు పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయింది. పనులు ప్రారంభించాలని టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు సూచించాం. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీకాంత్, ఆర్‌అండ్‌బీ ఏఈ, కథలాపూర్

క్లుప్తంగా

బీఆర్‌ఎస్ కార్యకర్తలతో మాజీ మంత్రి సమావేశం


ప్రశాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కథలాపూర్: మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం మండల నాయకులతో సమావేశమయ్యారు. పార్టీ పరిస్థితులు, మండల రాజకీయ పరిస్థితుల గురించి నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డిని మండల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య, గుండారపు గంగాధర్, ఎం.డీ రఫీక్, కల్లెడ శంకర్, బద్దం మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు


పూజలు చేస్తున్న దావ వసంత

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలో హనుమాన్ ఆలయ పునర్‌నిర్మాణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠతో పాటు నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

విద్యార్థికి అభినందన


ఆకాశ్‌ను అభినందిస్తున్న ఎంఈవో

పెగడపల్లి: కేంద్ర ప్రభుత్వం అందించే ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్)ఉపకార వేతనానికి మండలంలోని నామాపూర్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఆడెపు ఆకాశ్ అనే విద్యార్థి ఎంపికయ్యాడు. ఈ మేరకు నెలకు రూ. వెయ్యి చొప్పున నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ. 12 వేలు కేంద్ర ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్ రూపేణా అందుకోనున్నాడు. గురువారం విద్యార్థి ఆకాశ్‌ను శుక్రవారం పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పాలోజీ భాగ్యలక్ష్మి, ఎంఈవో సులోచన, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మెట్‌పల్లి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ సూచించారు. పట్టణంలోని 22 వార్డులో వంద రోజుల ప్రణాళికలో భాగంగా వివిధ అంశాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా తడి,పొడి చెత్తను వేర్వేరుగా చేసి ఇళ్ల వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి అందించాలన్నారు. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. అలాగే 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్‌ను వాడవద్దన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ విష్ణు, సిబ్బంది ముజీబ్, నిజాం, అశోక్, నరేశ్ ఉన్నారు.

ఉచిత కేన్సర్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

ధర్మపురి : యశోద హాస్పిటల్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత కేన్సర్ రోగ నిర్ధారణ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దామెర సుధాకర్‌రావు, జయలక్ష్మి తెలిపారు. ధర్మపురిలోని పాలెపు నరహరి కౌసల్య ఏసీ ఫంక్షన్ హాలులో ఈనెల 8న ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు క్యాన్సర్ స్పెషలిస్టు డాక్టర్ శ్రీహరి గౌడ ఆధ్వర్యంలో క్యాన్సర్ ఉచిత నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని, 200 మందికి మాత్రమే అవకాశం ఉంటుందని, ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు పాలెపు గణేష్ 994892577, కాసర్ల రమణ 9440748443 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



ధర్మపురి: పట్టణంలోని గ్రంథాలయం ముందున్న మ్యాన్‌హోల్ విరిగి ప్రమాదకరంగా మారింది. ఇక్కడికి నిత్యం గ్రంథాలయంలో చదువుకోవడానికి విద్యార్థులు వస్తుంటారు. అదే విధంగా పక్కనే ఉన్న పార్కులోకి చిన్నారులు వస్తుంటారు. ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీగా ఉండే ప్రదేశంలో ఈ మ్యాన్‌హోల్ ఉంది. ఎవరైనా పడి ప్రమాదానికి గురికాక ముందే సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్, ధర్మపురి, సెల్ నం: 6304101019

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

సమ్మర్ క్యాంపులతో విద్యార్థుల్లో విజ్ఞానం


శిక్షణ పొందిన విద్యార్థులతో కాంతాకుమారి

ధర్మపురి: సమ్మర్ క్యాంపులతో విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని విద్యావేత్త, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సతీమణి కాంతాకుమారి అన్నారు. ధర్మపురిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వశోధన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన సమ్మర్ క్యాంపు శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి కాంతాకుమారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అత్యుత్తమ విజ్ఞానాన్ని అందించుటకు ఇలాంటి సమ్మర్ క్యాంపులు ఎంతో ఉపయోగ పడుతాయని ఇలాంటి క్యాంపులు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. నెల రోజుల పాటు సాగిన శిబిరంలో విద్యార్థులకు యోగాతో పాటు కంప్యూటర్, సంగీతం, చిత్రలేఖనం, ఆరోగ్యం, ఆర్థిక శాస్త్రం,భగవద్గీత తదితర వాటిపై అవగాహన కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ వేదాంతం భార్గవ, హెచ్‌ఎంలు కొలిచాల శ్రీనివాస్, పెండ్యాల మహేందర్, గుండి రాంకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


రాయికల్ మండలం మైతాపూర్‌లో బడిబాటలో ఉపాధ్యాయులు


మల్లాపూర్ భరతమాత కూడలి వద్ద ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

ధర్మపురి/రాయికల్/కథలాపూర్/సారంగాపూర్/మల్లాపూర్/మల్యాల/ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవోలు, హెచ్‌ఎంలు అన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచడానికి ఉపాధ్యాయులు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. బడిబాటకు సంబంధించిన కర పత్రాలు పంపిణీ చేశారు. విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను వివరించి, కొత్తగా అడ్మిషన్లు తీసుకున్నారు. కార్యక్రమాల్లో ఎంఈవోలు, హెచ్‌ఎంలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, పాఠశాలల ఉపాధ్యాయులు, అమ్మ కమిటీ చైర్మన్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలి


గోధూర్‌లో దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్‌డీవో

జగిత్యాలరూరల్/పెగడపల్లి/సారంగాపూర్/ఇబ్రహీంపట్నం: రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్లు అన్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూతగాదాలతో బాధపడుతున్న రైతులు రెవెన్యూ సదస్సుల్లో తమ దరఖాస్తులు ఇస్తే క్షేత్రస్థాయిలోనే దరఖాస్తులను పరిశీలించి వారి వివరాలను భూభారతిలో పొందుపర్చినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఆర్‌డీవో శ్రీనివాస్, నాయకులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్‌ఐలు, సిబ్బంది కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


మాట్లాడుతున్న స్వరూప

మెట్‌పల్లిరూరల్: మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏయల్‌ఈఏపీ సంస్థ వైస్ ప్రెసిడెంట్ స్వరూప అన్నారు. మెట్‌పల్లి,ఇబ్రహీంపట్నం,మల్లాపూర్,కోరుట్ల,కథలాపూర్,మేడిపల్లి మండలాల స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు పారిశ్రామికంగా ఎదిగేందుకు అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెనియర్ ఆఫ్ ఇండియా ప్రపంచ బ్యాంక్ సహకారంతో రాష్ట్ర పరిశ్రమల శాఖ,డీఆర్‌డీఏ,సెర్ప్‌లు మహిళలకు ప్రోత్సాహం అందిస్తున్నాయన్నారు. మహిళలు తాము ఎంచుకున్న రంగాల్లో మరింత అభివృద్ధి సాధించేందుకు రుణసాయం అందిచడంతో పాటు పరిశ్రమల నిర్వహణ,ఉత్పత్తుల మార్కెటింగ్‌పై శిక్షణ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఎం వెంకటేశ్, ఏపీఎంలు విమోచన, శంకర్,ఏపీఆర్ శంకర్,సీసీలు సూరయ్య,శ్రీనివాస్, అశోక్, వెంకటరమణ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు వాడితేనే దిగుబడి


లక్ష్మీదేవిపల్లిలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

సారంగాపూర్: రైతులు పంట వేసే ముందు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకుని విత్తితేనే పంటల దిగుబడి అధికంగా వస్తుందని పొలాస పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ పద్మజ, డాక్టర్ మధుకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. నాణ్యమైన విత్తనాలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రదీప్‌రెడ్డి, ఏఈవోలు అంజనేయులు, వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

బుగ్గారం : రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా పొలాస వ్యవసాయ పరిశోధన స్థానానికి చెందిన శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని గోపులాపూర్, చిన్నాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఆయా గ్రామాల రైతులకు వివిధ రకాలైన పంటల సాగుపై,కార్యక్రమంలో శాస్త్రవేత్తలు బలరాం, శ్రీలక్ష్మి, వ్యవసాయాధికారి అక్షత, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: జిల్లాలోని బెస్ట్ అవలెబుల్ స్కూళ్లలో 2025–26 విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. గిరిజన విద్యార్థులకు 5 సీట్లు కేటాయించామని, ఇందులో 3వ తరగతిలో లంబాడి బాలికలకు ఒకటి, బాలురకు ఒకటి, గోండు బాలురకు ఒకటి కేటాయించామన్నారు. ఐదో తరగతిలో ఎరుకల బాలురకు ఒక్కటి కేటాయించగా, 8వ తరగతిలో లంబాడి బాలికలకు ఒక్కటి కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 9 నుంచి 17వ తేదీ వరకు దరఖాస్తులను జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలని, 20న లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

రాయికల్: మండలంలోని ఇటిక్యాల మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కొల్లూరి సంతోష్ శుక్రవారం తెలిపారు. టీజీటీలో తెలుగు, హిందీ, ఇంగ్లిష్ ,సైన్స్, సోషల్ లో సంబంధిత సబ్జెక్టులలో డిగ్రీతోపాటు బీఈడీ టీపీటీ,హెచ్‌పీటీ, టెట్ క్వాలిఫై ఉండాలని, పీజీటీలో తెలుగు రెండు పోస్టులు, ఇంగ్లిష్ రెండు పోస్టులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటని, కామర్స్ లో ఒక పోస్టుకు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులు ఈనెల 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 9618774635 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్యాల: మండలంలోని తక్కళ్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని మ్యాడంపల్లి ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ దయానంద్ తెలిపారు.

జగన్నాథ్‌పూర్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించాలి

రాయికల్: మండలంలోని గిరిజన గ్రామం జగన్నాథ్ పూర్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించాలని గిరిజన నాయకులు శుక్రవారం జగిత్యాల ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా గ్రామం నుంచి బోర్నపల్లి గ్రామానికి వెళ్లాలంటే రెండు గ్రామాల మధ్యలో వాగులో నుంచి వెళ్లాల్సిందేనని, ప్రస్తుతం నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో బోర్నపల్లికి వెళ్లలేని పరిస్థితి ఉందని, అధికారులు స్పందించి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆత్రం బీర్‌సాబ్, పెందూర్ మారుతి, మడవినారాయణ, విజయ్, జలపతి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని అక్రమించాలని చూసిన వ్యక్తులపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్ రామాలయం సమీపంలోని ఎస్సారెస్పీ భూమిలో విగ్రహాన్ని పెట్టి భూమి కబ్జా చేయాలని చూసిన చొప్పరి రాజు, దిట్టవేని అరుణ్ కుమార్‌లతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై గీత తెలిపారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేయాలని చూసిన వారిపై ఎస్సారెస్పీ ఏఏఈ ఇంద్రాల జాగృతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రతిష్ఠాపనలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, నాయకులు మహమ్మద్ రహీం, నర్సయ్య, మహిపాల్ రెడ్డి, అనంతరెడ్డి పాల్గొన్నారు.

దేశంలో సుపరిపాలన ఘనత బీజేపీదే

కథలాపూర్: దేశంలో పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సుపరిపాలన అందించిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని ఆ పార్టీ జిల్లా కో కన్వీనర్ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం కథలాపూర్‌లోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో 11 ఏళ్ల బీజేపీ ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసుకోవడానికి ప్రధాని మోదీ కృషి చేశారన్నారు. అసమావేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, నాయకులు మహేశ్, రవి, జీవన్‌రెడ్డి, ప్రతాప్, ప్రవీణ్, శ్రీకర్, నవీన్, మహేశ్, శాంతారాం, గణేశ్, రాజారెడ్డి పాల్గొన్నారు.

మల్యాల: ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనలో ఎన్నో చారిత్రాత్మక విజయాలు సాధించారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వాసుదేవ రెడ్డి అన్నారు. మల్యాలలో బీజేపీ మండలాధ్యక్షుడు గాజుల మల్లేశం అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. నరేంద్ర మోదీ సమర్థవంతమైన పాలనతో వికసిత్ భారత్ లక్ష్యం దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, సంగని రవి, కొల్లూరి గంగాధర్, రాజన్న, పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు 72 మంది ఎంపిక

కథలాపూర్: కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న జాతీయ ఉపకార వేతనాల(ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపిక కోసం నిర్వహించిన పరీక్షలో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏటా టాలెంట్ టెస్ట్ నిర్వహించి ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక చేస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం ఎనిమిదో తరగతి విద్యార్థులు రాసిన పరీక్ష ఫలితాలు వెలువడ్డాయి. ఇందులో జిల్లాకు చెందిన 72 మంది విద్యార్థులు ఎంపిక కావడంతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా పోచమ్మ సార్గమ్మ బోనాలు


బోనాల ఊరేగింపు.. పోతరాజుల విన్యాసాలు

కథలాపూర్: మండలంలోని తాండ్య్రాలలో శుక్రవారం గ్రామదేవతలు పోచమ్మ, సార్గమ్మల విగ్రహాలను ప్రతిష్ఠించారు. సాయంత్రం పోచమ్మ, సార్గమ్మలకు బోనాలు చేశారు. బోనాలతో ఊరేగింపు చేసి దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, డప్పుల చప్పుళ్లు ఆకట్టుకున్నాయి.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లిలో రేణుకా ఎల్లమ్మ తల్లి ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఎల్లమ్మ కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బీరయ్య ఉత్సవాలు

పెగడపల్లి: మండలంలోని పెగడపల్లిలో గొల్ల,కుర్మల ఆరాధ్య దైవమైన బీరయ్య ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం కుర్మలు వారివారి ఇళ్ల వద్ద నుంచి బోనాలు, గంగజలంతో బీర్ల కళాకారుల విన్యాసాల మధ్య ఆలయానికి ర్యాలీగా తరలివచ్చారు. బీరయ్య దేవునికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కుర్మ సంఘం పెద్దలు శ్రీనివాస్, గంగయ్య, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

పేదింటి కల నెరవేరింది

ఇబ్రహీంపట్నం: సొంత ఇంటి కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న మహిళలకు నేడు కల నెరవేరిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని డబ్బా గ్రామంలో శుక్రవారం19 మందికి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బూస రాజేశ్వర్, బుక్య రాజేందర్, మాజీ సర్పంచు గంగాధర్, నాయకులు గ్రామస్తులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

భూభారతితో భూ సమస్యలు పరిష్కారం

మెట్‌పల్లి రూరల్: ఏళ్ల నాటి భూ సమస్యలు భూభారతితో పరిష్కారంకానున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మెట్‌పల్లి మండలం కొండ్రికర్లలో భూభారతి రెవెన్యూ సదస్సును శుక్రవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. భూభారతి నూతన రెవెన్యూ చట్టం ద్వారా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు కిష్టగౌడ్,భూమాచారి,శ్రీనివాస్,లింగారెడ్డి,సురేశ్ పాల్గొన్నారు.